• ఒకే కాన్పులో ముగ్గురు

నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం పెగడపల్లికి చెందిన కావేరి కాన్పుకోసం శనివారం బోధన్‌లోని ఓ దవాఖానలో చేరింది. వైద్యులు ఆపరేషన్ చేయగా ముగ్గురు పిల్లలు జన్మించారు. ఇందులో ఇద్దరు మగబిడ్డలు ఉన్నారు. వారంతా క్షేమంగా ఉన్నారని వైద్యులు తెలిపారు.
– బోధన్ రూరల్

యాదగిరి కోపరేటివ్ బ్యాంకు గాయత్రిలో విలీనం

జగిత్యాల, జూన్ 9: యాదాద్రి భువనగిరి జిల్లాలోని యాదగిరి లక్ష్మీనరసింహ స్వామి (వైఎల్‌ఎన్‌ఎస్) కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకును జగిత్యాలలోని గాయత్రి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్‌లో విలీనం చేస్తున్నట్టు ఆ బ్యాంకు సీఈవో వనమాల శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 10నుంచే అమల్లోకి వస్తుందని, ఇక నుంచి వైఎల్‌ఎన్‌ఎస్ బ్యాంకు 6 బ్రాంచీలు గాయత్రీ బ్యాంక్ బ్రాంచీలుగా పని చేస్తాయని వివరించారు. గాయత్రీ బ్యాంక్ 39 బ్రాంచీలతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో సేవలందిస్తున్నదని, వైఎల్‌ఎన్‌ఎస్ బ్యాంకు విలీనంతో 45 బ్రాంచీలకు చేరుకుంటుందని చెప్పారు. విలీనం తర్వాత రూ.1,635.86 కోట్ల డిపాజిట్స్, రూ.1,177.82 కోట్ల రుణాలతో రూ.2,813.68 కోట్ల వ్యాపారానికి చేరుకున్నట్టు తెలిపారు. గాయత్రీ బ్యాంక్ 7.49 లక్షల కస్టమర్ బేస్‌తో దక్షిణాదిలోనే అగ్రస్థానంలో ఉన్నదని, వైఎల్‌ఎన్‌ఎస్ బ్యాంక్ 23 వేల ఖాతా దారులను కలిగి ఉన్నదని వివరించారు.

ఏపీలో కొత్త మద్యం పాలసీ

హైదరాబాద్, జూన్ 9 (నమస్తే తెలంగాణ) : ఏపీలో కొత్త మద్యం పాలసీని తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు మద్యం పాలసీపై ఈ నెల 14న అధికారిక ఉత్తర్వులు రానున్నాయి. ప్రస్తుతం ఉన్న మద్యం పాలసీని రద్దు చేస్తున్నట్టు ప్రభుత్వం వెల్లడించింది. కొత్త మద్యం పాలసీలో భాగంగా ప్రస్తుతం ఉన్న డిస్టలరీస్ అన్నిటి లైసెన్సులను రద్దు చేయనున్నది. రాష్ట్రంలో ఉన్న 3,600 మద్యం దుకాణాలకు టెండర్ విధానంలో కేటాయించనున్నారు.

కొడంగల్ లిఫ్ట్‌తో ఆర్థిక భారం!

- ప్రెషర్ మెయిన్స్‌తో 52 కోట్లు అదనం
- మెయింటెనెన్స్ ఖర్చులు ఎక్స్‌ట్రా
- భారీగా పెరిగిన ఎత్తిపోతల బడ్జెట్
- ఉద్దండాపూర్ నుంచి ప్రతిపాదనలున్నా పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం
- టన్నెల్ ఆలస్యమవుతుందని సాకులు
- పంప్‌హౌస్, ఎరక్షన్‌కు అదే సమయం పడుతుందన్న అధికారులు

హైదరాబాద్, జూన్ 9 (నమస్తే తెలంగాణ): సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో నిధులను వృథా చేయబోము అంటూ ఒకవైపు ప్రకటిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. ఆచరణలో అందుకు భిన్నంగా ముందుకు సాగుతున్నది. అందుకు తాజాగా ప్రతిపాదించిన నారాయణపేట–కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం (ఎన్‌కేఎల్‌ఐఎస్) ఉదాహరణగా నిలుస్తున్నది. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో కొడంగల్, నారాయణపేట నియోజకవర్గాలకు సాగునీటిని అందించే ప్రతిపాదనలున్నా, వాటిని పక్కనపెట్టి రూ.4,350 కోట్ల వ్యయంతో ఎన్‌కేఎల్‌ఐఎస్‌ను చేపట్టేందుకు సిద్ధమవుతున్నది. తొలుత ప్రతిపాదించిన సొరంగ నిర్మాణాలను కాదని, ప్రెషర్ మెయిన్స్‌ను ప్రతిపాదించింది. దీంతో రూ.53 కోట్ల వ్యయం పెరుగుతుండగా, ఏటా మెయింటెనెన్స్ చార్జీలు అదనపు భారం కానున్నాయి. ఈ ప్రతిపాదనలపై ఇంజినీర్లు, సాగునీటిరంగ నిపుణులు అభ్యంతరాలు వ్యక్తంచేస్తున్నారు.

3,117 కోట్ల నుంచి 4,350 కోట్లకు పెంపు

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని నారాయణపేట, కొడంగల్, మక్తల్ నియోజకవర్గాల్లోని రూ.లక్ష ఎకరాలకు సాగునీటితోపాటు నారాయణపేట జిల్లాలో తాగునీటి అవసరాలకు ఎన్‌కేఎల్‌ఐఎస్ చేపట్టాలని తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించింది. రెండు దశల్లో చేపట్టనున్న లిఫ్ట్ పనులకు త్వరలోనే టెండర్లు పిలిచేందుకు సన్నాహాలు చేస్తున్నది. మొదటి దశలో భూత్పూరు జలాశయం నుంచి ఊట్కూరు చెరువుకు, అక్కడి నుంచి జయమ్మ చెరువుకు, అక్కడి నుంచి కనుకుర్తి చెరువుకు లిఫ్ట్ చేయనున్నారు. మొదటి దశ పనులకు రూ.2,945 కోట్లు వ్యయమవుతుందని అంచనా వేశారు. రెండో దశలో జాజాపూర్, దౌల్తాబాద్, బొమ్రాస్‌పేట, లక్ష్మీపూర్, ఎర్లపల్లి, హున్నాబాద్, కొడంగల్ చెరువుల నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచి, గ్రావిటీ కాల్వలు, ఆయకట్టుకు నీటిని అందించే డిస్ట్రిబ్యూటరీ కాల్వలను నిర్మిస్తారు. అందుకు రూ.1,404.50 కోట్లు వ్యయమవుతుందని అంచనావేశారు. మొత్తం ప్రాజెక్టు కోసం రూ.4,350 కోట్లుగా నిర్ణయించారు. వాస్తవంగా ఉమ్మడి రాష్ట్రంలో చేపట్టిన సర్వేలు, డీపీఆర్ ప్రతిపాదనల ప్రకారం ఈ పథకానికి అయ్యే వ్యయం రూ.3,117 కోట్లుగా అంచనా వేసినా, ప్రస్తుత ప్రభుత్వం అంచనాలను సవరించటం గమనార్హం.

ప్రెషర్ మెయిన్స్‌తో అదనంగా 52 కోట్లు

గతంలో ప్రతిపాదించిన భూగర్భ సొరంగాల స్థానంలో ప్రెషర్ మెయిన్స్ ద్వారా నీటిని తరలించాలని ప్రభుత్వం తాజాగా నిర్ణయించడంతో ప్రాజెక్టు వ్యయం రూ.60 కోట్లు పెరగనున్నది. భూత్పూర్ రిజర్వాయర్ నుంచి నీటిని లిఫ్ట్ చేసి సొరంగాల ద్వారా తరలించాలి. దాదాపు 38 కిలోమీటర్ల పొడవు సొరంగాలను తవ్వాలి. భూగర్భ సొరంగాలకు బదులుగా ప్రెషర్ మెయిన్స్ ద్వారా నీటిని లిఫ్ట్ చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. భూసేకరణ, జియోలాజికల్ అధ్యయనాలు, సొరంగాలకు అడ్డుగా ఉండే రాళ్లు, బండల కటింగ్‌కు ఎక్కువ సమయం పడుతుందని, అందుకే ప్రెషర్ మెయిన్స్ నిర్మించాలని నిర్ణయించినట్టు చెప్తున్నది. కానీ, ప్రభుత్వ వాదనలను ఇంజినీరింగ్ నిపుణులు కొట్టిపారేస్తున్నారు. ప్రెషర్ మెయిన్స్‌తో ప్రాజెక్టును చేపట్టినా మూడేండ్లు పడుతుందని స్పష్టం చేస్తున్నారు. మోటర్లు రావడానికి, పంప్‌హౌస్‌ల నిర్మాణం, మోటర్ల బిగింపునకు రెండున్నరేండ్లు పడుతుందని వివరిస్తున్నారు. సొరంగాల ద్వారా పంపింగ్ సిస్టమ్‌ను పూర్తిచేయడానికి రూ.963.89 కోట్లే అవసరం అయితే, ప్రెషర్ మెయిన్స్ ద్వారా రూ.1,016.57 కోట్లు అవుతుందని లెక్కలతో సహా తేటతెల్లం చేస్తున్నారు. అయినా, ప్రభుత్వం ప్రెషర్‌మెయిన్స్‌ను చేపడుతున్నదని ఇంజినీర్లు వివరిస్తున్నారు. అది కాంట్రాక్టర్లను బతికించడానికేనని విమర్శిస్తున్నారు.

'పాలమూరు'లో ప్రతిపాదనలున్నా..

కొడంగల్–నారాయణపేట లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ద్వారా మొత్తం లక్ష ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందించాలని నిర్ణయించారు. మక్తల్ నియోజకవర్గంలో ఊట్కూరు, మక్తల్ మండలాల పరిధిలో 25,783 ఎకరాలు, నారాయణపేట నియోజకవర్గంలో నారాయణపేట, ధన్వాడ, దామరగిద్ద మండలాల్లో 20,472 ఎకరాలు, కొడంగల్ నియోజకవర్గంలోని కొడంగల్, మద్దూరు, కోస్గి, దౌల్తాబాద్, బొమ్రాస్‌పేట మండలాల్లో 53,745 ఎకరాలను ప్రతిపాదించారు. దాంతోపాటు 0.38 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేసి నారాయణపేట జిల్లాలోని పలు గ్రామాలకు తాగునీటిని అందించాలని నిర్ణయించారు. కానీ, ఆయా ప్రాంతాలకు ఇప్పటికే చేపట్టిన పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కింద సాగునీరు ఇవ్వాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. ఆ ప్రాజెక్టులో కీలకమైన ఉద్దండాపూర్ రిజర్వాయర్ నుంచి సాగునీరిచ్చేందుకు ప్రతిపాదలున్నాయి. కాల్వ తవ్వకానికి సైతం గత ప్రభుత్వం దాదాపు రూ.5,600 కోట్లు మంజూరు చేసింది. ఉద్దండాపూర్ కెనాల్‌పై అదనంగా పలుచోట్ల చిన్న చిన్న లిఫ్ట్‌లను ఏర్పాటు చేసి కొడంగల్, నారాయణపేట నియోజకవర్గాల్లోని ఎత్తయిన ప్రాంతాలకు సైతం నీటిని అందించాలని నిర్ణయించింది. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ప్రతిపాదనలన్నీ పక్కనపెట్టి నారాయణపేట, కొడంగల్ లిఫ్ట్‌ను చేపట్టడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిధులు వృథా అవుతాయని ఇంజినీరింగ్ నిపుణులు వివరిస్తున్నారు. అదీగాక ఈ స్కీం వల్ల రాజీవ్‌భీమా ఆయకట్టుకు సైతం ముప్పు ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ప్రతిపాదనలు మానుకోవాలని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నారు.

సాధువులను ఢీకొట్టిన డీసీఎం వాహనం

ముగ్గురు జైనమత ప్రచారకుల దుర్మరణం • మరో ఇద్దరికి తీవ్రగాయాలు
వనపర్తి జిల్లా రంగాపురం వద్ద ఘటన

పెబ్బేరు, జూన్ 9 : పాదయాత్రగా వెళ్తున్న సాధువులపైకి డీసీఎం వాహనం దూసుకెళ్లడంతో ముగ్గురు దుర్మరణం చెందారు. ఈ ఘటన వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం రంగాపురం వద్ద ఎన్‌హెచ్–44పై ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకున్నది. ఎస్సై హరిప్రసాద్‌రెడ్డి కథనం మేరకు.. గుజరాత్‌కు చెందిన కొందరు సాధువులు జైనమత ప్రచారం కోసం ఈ నెల 3న హైదరాబాద్ నుంచి బెంగళూరు వరకు పాదయాత్రగా బయలుదేరారు. శనివారం రాత్రి రంగాపురంలోని ప్రభుత్వ పాఠశాలలో బస చేసి తెల్లవారుజామున తిరిగి పయనమయ్యారు. కాసేపటికే హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న డీసీఎం వాహనం అతివేగంగా సాధువుల పైకి దూసుకొచ్చి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పునీత్ మహరాజ్ (50), భగవాన్‌భాయ్ (36), హేమల్ ప్రవీణ్‌షా (52) మృతి చెందారు. మరో ఇద్దరు విజ్ఞాన్ ప్రజ్ఞ సూరజ్ మహరాజ్, ప్రియాంకర్ మహరాజ్ తీవ్రంగా గాయపడగా.. గద్వాల దవాఖానకు తరలించారు. ఇందులో గురువు విజ్ఞాన్ ప్రజ్ఞ సూరజ్ మహరాజ్ వృద్ధాప్యం కారణంగా వీల్ చైర్‌లో యాత్ర కొనసాగిస్తుండగా.. భగవాన్‌భాయ్, హేమల్ ప్రవీణ్‌షా తోస్తుండగా ప్రమాదం జరిగింది. డీసీఎంలో డ్రైవర్ నరేశ్, క్లీనర్ హరీశ్ ఉన్నారు. విషయం తెలుసుకున్న విజ్ఞాన్ ప్రజ్ఞ సూరజ్ మహరాజ్ శిష్యుడు, కర్నూల్‌కు చెందిన బట్టల వ్యాపారి అశోక్‌కుమార్ జైన్ ఘటనా స్థలానికి చేరుకొని ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్సై తెలిపారు.

మెల్‌బోర్న్‌లో ఘనంగా తెలంగాణ కల్చరల్ ఉత్సవాలు

హైదరాబాద్, జూన్ 9(నమస్తే తెలంగాణ) : మెల్‌బోర్న్‌లో తెలంగాణ కల్చరల్ దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. శనివారం మెల్‌బోర్న్ తెలంగాణ ఫోరం(ఎంటీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవాలకు తెలుగు మాట్లాడేవారు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాకారులు తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలు ప్రతిబింబించేవిధంగా ప్రదర్శనలు ఇచ్చారు. ముఖ్యంగా రామాయణం, శ్రీరాముడి నేపథ్యంతో కూడిన జానపద నృత్యాలు, సంగీత ప్రదర్శనలు, నాటక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకొన్నాయి. ఈ సందర్భంగా ఎంటీఎఫ్ అధ్యక్షురాలు లక్ష్మీ నూకల మాట్లాడుతూ... తెలంగాణ సాంస్కృతిక దినోత్సవం కేవలం వారసత్వానికి సంబంధించినదే కాదని, మన సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవడంపట్ల మనకున్న నిబద్ధతకు నిదర్శనమని చెప్పారు. కార్యక్రమంలో విక్టోరియన్ మల్టీకల్చరల్ కమ్యూనిటీ చైర్‌పర్సన్ వివియన్, మెల్‌బోర్న్‌లోని ఇండియన్ ఎంబసీ కాన్సుల్ జనరల్ డాక్టర్ సుశీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా ఆటా మహాసభలు

హైదరాబాద్, జూన్ 9(నమస్తే తెలంగాణ) : అట్లాంటాలో 18వ అమెరికా తెలుగు సంఘం(ఆటా) మహాసభలు అత్యంత కోలాహలంగా జరుగుతున్నాయి. జార్జియా వరల్డ్ కాంగ్రెస్ సెంటర్‌లో 7న మహాసభలు ప్రారంభంకాగా, చివరిరోజు ఆదివారం సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. విద్య, వ్యాపార, ఆరోగ్య, సామాజిక సేవ తదితర రంగాలకు చెందిన ప్రముఖులను నిర్వాహకులు సత్కరించారు. ఆటా అధ్యక్షుడు మధు బొమ్మినేని ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ మహాసభలకు రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తెలుగు సినీ నటులు శ్రీకాంత్, మెహ్రీన, డైరెక్టర్లు సందీప్ రెడ్డి వంగా, తమ్మారెడ్డి భరద్వాజ, పలువురు సినీ, రాజకీయరంగ ప్రముఖులు పాల్గొన్నారు. అదేవిధంగా, పాలమూరు ఎన్‌ఆర్‌ఐ ఫోరం సదస్సు నిర్వహించగా, ఇందులో దేవరకద్ర, జడ్చర్ల, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యేలు జీ మధుసూదన్ రెడ్డి అనిరుధ్ రెడ్డి,రాజేశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పాలమూరులో బడుల అభివృద్ధికి కృషిచేస్తామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. పరమేశ్ భీమ్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో రవి మేరెడ్డి, రామ్ మోహన్ కొండ, రమేశ్ నెల్లవోలు, విజయ్ గంగుల, యాది పట్కుల, టీఆర్ రెడ్డి, డాక్టర్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

రెరా ట్రిబ్యునల్ చైర్మన్, సభ్యుల బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్, జూన్ 9 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ రియల్ ఎస్టేట్ అప్పిలేట్ ట్రిబ్యునల్ చైర్మన్‌గా జస్టిస్ ఎ రాజశేఖర్‌రెడ్డి (రిటైర్డు), సభ్యులుగా ప్రదీప్‌కుమార్‌రెడ్డి పల్లె (అడ్వకేట్, జ్యూడిషియల్ సభ్యుడు), రిటైర్డు ఐఏఎస్ అధికారి చిత్రా రామచంద్రన్ (టెక్నికల్/అడ్మినిస్ట్రేటివ్ సభ్యులు) శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వీరికి 'రెరా' అథారిటీ చైర్మన్ ఎన్ సత్యనారాయణ, సభ్యులు కే శ్రీనివాస్‌రావు, జే లక్ష్మీనారాయణ పుష్పగుచ్ఛాలిచ్చి, శుభాకాంక్షలు తెలిపారు. వీరిని 7న రాష్ట్ర ప్రభుత్వం నియమించిన విషయం తెలిసిందే.

బరాజుల్లో కొనసాగుతున్న మరమ్మతులు

మహదేవపూర్/కాళేశ్వరం, జూన్ 9: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ (లక్ష్మీ) బరాజ్‌లో నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ ఆదేశాల మేరకు నిర్మాణ సంస్థ ఎల్‌టీ ఆధ్వర్యంలో ఏడో బ్లాక్ వద్ద మరమ్మతు పనులు జరుగుతున్నాయి. సీఎస్‌ఎంఆర్‌ఎస్ (సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్ రిసెర్చ్ స్టేషన్) బృందం పరిశోధనలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బరాజ్ లోపలపై అధ్యయనానికి కుంగిన ప్రాంతంలో పలు రకాల నమూనాలు సేకరిస్తున్నారు. బరాజ్‌లోని మొత్తం 85 గేట్లకు 81 గేట్లు ఎత్తి ఏడో బ్లాక్‌లోని 18, 19, 20, 21వ గేట్లను ఎత్తేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. దెబ్బతిన్న పియర్ల వద్ద ఏర్పడ్డ ఖాళీ ప్రదేశాల్లో సిమెంట్, ఇసుక, కెమికల్ మిశ్రమంతో గ్రౌటింగ్ చేస్తున్నారు. బరాజ్ దిగువ ప్రాంతంలో నీటి ప్రవాహానికి పియర్ల చుట్టూ ఉన్న ఇసుక కొట్టుకుపోకుండా భారీ యంత్రాలు, క్రేన్ల సాయంతో షీట్‌ఫైల్స్, సీసీ బ్లాక్‌లను అమర్చుతున్నారు. అన్నారం (సరస్వతీ) బరాజ్‌లోనూ సీసీ బ్లాక్ పనులు కొనసాగుతున్నాయి. బ్లాక్‌ల మధ్యలో ఇసుక నింపుతున్నారు. బరాజ్ ముందు భాగంలో ఇప్పటికే 2 లక్షల టన్నుల ఇసుక తీయగా, మరో 7 లక్షల టన్నులు తీయాల్సి ఉన్నది. అలాగే బరాజ్‌లో ఎన్‌డీఎస్‌ఏ సూచనల మేరకు సోమవారం బోర్ లాక్ పనులు ప్రారంభించనున్నట్టు అధికారులు తెలిపారు.

మేడిగడ్డ బరాజ్‌లో జరుగుతున్న మరమ్మతు పనులు

ఈసారైనా బీసీ బిల్లు పెట్టండి

• ప్రధానికి ఆర్ కృష్ణయ్య లేఖ

హైదరాబాద్, జూన్9 (నమస్తే తెలంగాణ): ఈ సారైనా బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లును ప్రవేశపెట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యకుడు, ఎంపీ ఆర్ కృష్ణయ్య కోరారు. ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన మోదీకి శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జాతీయ స్థాయిలో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ పథకం పెట్టాలని, కేంద్రంలో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, బీసీ, ఎస్సీ, ఎస్టీలకు రూ. 20 లక్షల చొప్పున అందజేయాలని కోరారు. జనాభా ప్రకారం వాటా ఇవ్వకపోతే తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు.

యూపీఐ మోసాలకు చెక్

నేడు ఎంతో ప్రజాదరణ పొందిన ఆన్‌లైన్ పేమెంట్ పద్ధతుల్లో యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ఒకటి. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) అభివృద్ధి చేసిన ఈ విధానం.. దేశంలోని చెల్లింపుల వ్యవస్థలో చాలా మార్పులనే తీసుకొచ్చింది. అయితే పెరుగుతున్న యూపీఐ మోసాలు ఇప్పుడు వినియోగదారులను తీవ్ర భయాందోళనకు గురి చేస్తున్నాయి. గత కొన్నేండ్లుగా అనేక మార్గాల్లో అమాయకుల సొమ్మును స్కామర్లు, ట్రిక్‌స్టర్లు దోచేస్తున్నారు. దీంతో ఎన్‌పీసీఐ తమ కస్టమర్ల రక్షణార్థం ఐదు రకాల సేఫ్టీ టిప్స్ చెప్తున్నది. వాటిని పరిశీలిస్తే..

ఈ ఐదింటిని అనుసరించండి

1. నగదు స్వీకరణకు స్కాన్ అక్కర్లేదు

చాలామంది స్కామర్లు అమాయకులను మోసం చేయడానికి.. మీకు మేము నగదు పంపాలంటే ఈ యూపీఐ కోడ్‌ను స్కాన్ చేయాలని చెప్తున్నారు. అయితే ఇది ఎంతమాత్రం నిజం కాదు. మీరు ఎవరికైనా నగదును పంపాలంటేనే క్యూఆర్ కోడ్స్ స్కానింగ్ అవసరం. అంతేగానీ మీరు ఎవరి నుంచైనా నగదును స్వీకరించడానికి స్కాన్‌తో పనిలేదు. కాబట్టి ఇకపై ఎవరైనా మీకు నగదు పంపాలంటే ఈ యూపీఐ కోడ్‌ను స్కాన్ చేయాలని చెప్తే.. దాన్ని మోసంగా గుర్తించండి.

2. చెల్లింపులకే యూపీఐ పిన్ అవసరం

మోసగాళ్లు ఈ మధ్య కాలంలో మరో ట్రిక్‌ను ప్లే చేస్తున్నారు. మీరు నగదును పొందాలంటే మీ యూపీఐ పిన్ ఎంటర్ చేయాలని అంటున్నారు. ఇది కూడా నమ్మవద్దు. మీ బ్యాంక్ ఖాతా నుంచి ఎవరికైనా యూపీఐ ఆధారిత యాప్స్ ద్వారా నగదును పంపాలంటేనే మీ సీక్రెట్ పిన్ ఎంట్రీ అవసరం. అంతేతప్ప మీరు ఎవ్వరి నుంచైనా నగదును పొందాలంటే అవసరం లేదు.

3. వివరాలు తెలుసుకున్నాకే..

ఎవరికీ యూపీఐ యాప్స్ ద్వారా గుడ్డిగా నగదును పంపించవద్దు. మీరు ఎవరికైతే నగదును పంపించాలనుకుంటున్నారో ఆ వివరాలను పూర్తిగా తెలుసుకోవాలి. అంటే వ్యక్తుల కైతే ఆ మొబైల్ నెంబర్ వారిదేనా? కాదా? అన్నది చూడాలి. అలాగే మొబైల్ నెంబర్‌ను ఎంటర్ చేసినప్పుడు వచ్చే పేరు వారిదా? లేదా? అన్నదీ చూడాలి. ఇక దుకాణాల్లో, షాపింగ్ మాల్స్, మరే ఇతర చోట్లనైనా క్యూఆర్ కోడ్స్‌ను స్కానింగ్ చేసేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా గోడల మీద, ఇంకా ఎక్కడైనా అతికించిన కోడ్స్‌ను స్కాన్ చేసినప్పుడు అక్కడి దుకాణదారులను అడిగి వారిదేనా? అని ధ్రువీకరించుకోవాలి. లేకపోతే షాప్‌వాళ్లకు కూడా తెలియకుండా మోసగాళ్లు అంటించిన తప్పుడు క్యూఆర్ కోడ్స్‌ను స్కాన్ చేసి నగదును నష్టపోయే ప్రమాదం ఉన్నది.

4. అనవసరపు యాప్‌ల డౌన్‌లోడ్ వద్దు

సైబర్ నేరగాళ్లు.. ఏవైనా ప్రోత్సాహకాలు, ఆఫర్లు రావాలంటే యూజర్లను ఫలానా యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని అడుగుతూ ఉంటారు. అయితే ఆ ప్రక్రియ పూర్తి కావాలంటే యూజర్ల యూపీఐ పిన్ నెంబర్ అవసరం. ఒకవేళ మోసగాళ్ల మాటలు నమ్మి సదరు యాప్‌ను డౌన్‌లోడ్ చేసి, అక్కడ అడిగిన మీ యూపీఐ పిన్ నెంబర్‌ను ఎంటర్ చేస్తే మీ ఖాతాలోని నగదు అంతా మాయం. అందుకే అనామక యాప్‌ల జోలికి వెళ్లవద్దు. తెలియని యాప్‌లను అస్సలు డౌన్‌లోడ్ చేసుకోవద్దు. మీ మొబైల్‌లో మీకు తెలియని, మీరు వాడని యాప్‌లు ఉన్నా డిలీట్ చేయడం ఉత్తమం. ఎందుకంటే మీరు తెలిసో, తెలియకనో డౌన్‌లోడ్ చేసిన వాటివల్ల మీ రహస్య సమాచారం మీరు గుర్తించకుండానే మోసగాళ్లకు అందే ప్రమాదం ఉన్నది. ఇక మీరు ఎప్పుడూ వాడే యూపీఐ యాప్ పేజీలో తప్ప మరెక్కడా మీ పిన్ నెంబర్లను ఎంటర్ చేయవద్దు.

5. స్క్రీన్, పిన్, ఓటీపీ షేరింగ్‌లతో నష్టం

అపరిచితుల నుంచి ఏవైనా వస్తే వాటిని ఇతరులకు షేరింగ్ చేయడం ఆపేయండి. లింక్స్, స్క్రీన్‌షాట్స్‌కు దూరంగా ఉండాలి. కనిపించిన లింక్స్‌పై క్లిక్ చేయవద్దు. అలాగే ఎవరితోనూ మీ పిన్ నెంబర్లను షేర్ చేసుకోవద్దు. ఒకవేళ మీ స్నేహితులు, బంధువుల్లో ఎవరికైనా చెప్పాల్సి వస్తే.. ఆ తర్వాత వెంటనే పిన్ నెంబర్‌ను మార్చేయాలి. ఇక ఆర్థిక వ్యవహారాల్లో ఓటీపీలను ఎవరూ అడగరు. అడిగారంటే మిమ్మల్ని మోసం చేస్తున్నట్టే లెక్క. కాబట్టి మీ మొబైల్‌కు వచ్చిన ఓటీపీలను ఎవ్వరికీ చెప్పవద్దు. మీ బ్యాంక్ ఖాతా నెంబర్లు, మీ మొబైల్ బ్యాంకింగ్, ఆన్‌లైన్ బ్యాంకింగ్, ఏటీఎం పిన్ నెంబర్లు, ఇతరత్రా కీలక సమాచారాన్ని మీ మొబైల్స్‌లో దాచుకోవద్దు. మీ మొబైల్ హ్యాకింగ్‌కు గురైతే ఆ విలువైన సమాచారం మోసగాళ్లకు అందుతుంది. అప్పుడు అన్ని రకాలుగా నష్టపోవాల్సి వస్తుంది. ఫోన్‌ను తరచూ ఫార్మాట్ చేస్తూ ఉంటే మీకు తెలియకుండా వచ్చే మోసపూరిత యాప్స్ నుంచి తప్పించుకోవచ్చు.

పెట్టుబడుల దిశగానే..

గత వారం దేశీయ స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒడిదొడుకుల నడుమ భారీ లాభాలనే అందుకున్నాయి. లోక్‌సభ ఎన్నికల ఎగ్జిట్ పోల్స్, ఫలితాల ప్రభావం ట్రేడింగ్‌పై ప్రస్ఫుటంగా కనిపించింది. మదుపరులు అమ్మకాలు, కొనుగోళ్ల మధ్య ఊగిసలాడారు. ఈ క్రమంలోనే సోమవారం ఆల్‌టైమ్ హైకి చేరినా.. మంగళవారం మాత్రం మునుపెన్నడూ లేనివిధంగా సూచీలు రికార్డు స్థాయి నష్టాలపాలయ్యాయి. అయినప్పటికీ తర్వాతి మూడు రోజులు కోలుకుని పరుగులు పెట్టాయి. దీంతోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్‌ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 2,732.05 పాయింట్లు పుంజుకొని 76,693.36 వద్ద స్థిరపడింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్‌ఎస్‌ఈ) సూచీ నిఫ్టీ 759.45 పాయింట్లు అందుకుని 23,290.15 దగ్గర నిలిచింది. ఈ క్రమంలో ఈ వారం కూడా సూచీలు లాభాల్లోనే కదలాడవచ్చన్న అంచనాలున్నాయి. ఇక గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు ఎప్పట్లాగే ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 22,800 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 22,600 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 23,600–23,800 మధ్యకు నిఫ్టీ వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

ప్రీమియం రిటర్న్ వద్దు

టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్లాన్ ఎంచుకోండిలా..



జీవిత బీమా సంస్థలు.. భారతీయుల ఆలోచనా విధానాన్ని అర్థం చేసుకోవడంలో దిట్ట. అందుకే వారి రూట్లోనే వెళ్లి తమకు కావాల్సిన లాభాల్ని మరింత పెంచుకోవడం ఎలా? అన్న కోణంలో నిత్యం అన్వేషిస్తుంటాయి. అలా పుట్టినవే కొన్ని ప్లాన్లున్నాయి. టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్‌ల్లో ప్రీమియం రిటర్న్ ఆప్షన్ ప్లాన్ వాటిలో ఒకటే. దేశంలో ఎక్కువమంది సంప్రదాయ ఎండోమెంట్ రకం జీవిత బీమానే ఇప్పటికీ తీసుకుంటున్నారు. అయితే టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ అనేది ఓ ఉత్తమ ఎంపిక అని అర్థం చేసుకుంటున్నవారు ఇప్పుడిప్పుడే పెరుగుతున్నారు.

అయినా కొందరు భారతీయులు ఇంకా బీమా కొనుగోళ్ల సమయంలో మెచ్యూరిటీ (బీమా కాలవ్యవధి తర్వాత పాలసీదారుడు జీవించి ఉంటే వచ్చే ప్రయోజనం) అంశాన్నే ప్రధానంగా చూస్తున్నారు. టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీలతో నష్టమేనన్నది వారి భావన. అందుకే ఇలాంటివారి కోసం జీవిత బీమా సంస్థలు తెచ్చినవే టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీల్లో ప్రీమియం రిటర్న్ ఆప్షన్ ప్లాన్లు. ప్రస్తుతం టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీల్లో ప్రధానంగా రెండు రకాలున్నాయి. ఒకటి ప్లెయిన్ లేదా సాధారణ ప్లాన్. మరొకటి ప్రీమియం రిటర్న్ ఆప్షన్ ప్లాన్. బీమా కాలవ్యవధిలో పాలసీదారుడు చనిపోతే సాధారణ టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్‌లోనైనా, ప్రీమియం రిటర్న్ ఆప్షన్ ఉన్న టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్‌లోనైనా ఒకేలా బీమా సొమ్ము మొత్తాలు వస్తాయి. కానీ సాధారణ టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీలో మెచ్యూరిటీ అనేది ఉండదు. ప్రీమియం రిటర్న్ ఆప్షన్ పాలసీలో అది ఉంటుంది. అంటే బీమా కాలవ్యవధి తర్వాత పాలసీదారుడు బ్రతికి ఉంటే ఇన్సూరెన్స్ కోసం ఇన్నాళ్లూ మనం చెల్లించిన ప్రీమియం మొత్తాలన్నీ కూడా ఈ ప్రీమియం రిటర్న్ ఆప్షన్ ప్లాన్‌లో తిరిగి వస్తాయి. ఇది పాలసీదారులను ఆకట్టుకునే ఆఫర్. అయితే ఇక్కడే అసలు మతలబు దాగున్నది.

ఇదీ సంగతి..

మెచ్యూరిటీ ఆఫర్‌కు ఆకర్షితులై ప్రీమియం రిటర్న్ ఆప్షన్ ఉన్న టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్లాన్ కొంటే చాలా నష్టం. సాధారణ టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్లాన్ ప్రీమియంలతో పోల్చితే ఈ ప్రీమియం రిటర్న్ ఆప్షన్ టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్లాన్ ప్రీమియంలు ఎక్కువ మరి. అందుకే వీటి జోలికి వెళ్లొద్దని నిపుణుల సలహా.

ఉదాహరణగా చూస్తే..

కిరణ్ వయసు 25 ఏండ్లు. 30 ఏండ్ల కాలవ్యవధితో కోటి రూపాయల టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్‌ను తీసుకోవాలనుకున్నాడు. ఈ క్రమంలోనే తాను సంప్రదించిన బీమా సంస్థలో సాధారణ టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ వార్షిక ప్రీమియం రూ.18,934గా, ప్రీమియం రిటర్న్ ఆప్షన్ టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ వార్షిక ప్రీమియం రూ.47,712గా ఉన్నది. ఈ రెండు ప్రీమియంల మధ్య వ్యత్యాసం రూ.28,778. ఇది సాధారణ టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఏడాదిన్నర ప్రీమియంకు సమానం. పాలసీ కాలవ్యవధి 30 ఏండ్లలో పాలసీదారుడు చనిపోతే వచ్చేది మాత్రం రెండు ప్లాన్లలో కోటి రూపాయలే అయినా.. సాధారణ టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో 30 ఏండ్ల తర్వాత పాలసీదారుడు బ్రతికి ఉన్నా నయాపైసా రాదు. అదే ప్రీమియం రిటర్న్ ఆప్షన్ టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్లాన్‌లో ఈ 30 ఏండ్లు మీరు చెల్లించిన వార్షిక ప్రీమియంలన్నీ తిరిగి వచ్చేస్తాయి. అంటే ఏటా రూ.47,712 చొప్పున 30 ఏండ్లకు రూ.14,31,360 వస్తుంది. దీంతో కిరణ్ దాన్నే ఎంచుకోవాలనుకున్నాడు.

ఇదీ నష్టం..

ప్రీమియం రిటర్న్ టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్లాన్‌లో మీరు ఎంత చెల్లిస్తే అంతే వస్తుంది. దానిపై ఎలాంటి వడ్డీ, ఇతర ప్రయోజనాలు రావు. అదే మీరు సాధారణ టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్లాన్ తీసుకుంటే.. ఏటా మిగిలే ఆ రూ.28,778ని 30 ఏండ్లపాటు ఎక్కడ పెట్టుబడి పెట్టినా 7 నుంచి 10 శాతం రిటర్న్స్‌తో 30 ఏండ్ల తర్వాత మీరు అందుకునే మొత్తం రూ.29 లక్షల నుంచి రూ.52 లక్షల మధ్య ఉంటుంది. ప్రీమియం రిటర్న్ ఆప్షన్ ప్లాన్‌లో 30 ఏండ్ల తర్వాత మీకు అందుతున్నది రూ.14.31 లక్షలే. దీన్నిబట్టి మీరు ఎంత నష్టపోతున్నారో అర్థం చేసుకోవచ్చు. కనీసం రూ.15 లక్షల నుంచి రూ.38 లక్షల వరకు నష్టపోతున్నారు.

చివరగా..

టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ అనేది నిజంగా పాలసీదారులకు ఎంతో లాభం. సంప్రదాయ ఎండోమెంట్, మనీ బ్యాక్ ప్లాన్లకన్నా ఉత్తమం. అందులో ఎలాంటి సందేహం లేదు. అయితే అనవసరపు ఆఫర్లకు పొంగిపోయి బీమా సంస్థలు లేదా ఏజెంట్ల మాటల్ని నమ్మి ప్రీమియం రిటర్న్ ఆప్షన్ టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్లాన్లను తీసుకోకండి. సాధారణ టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్లాన్‌ను తీసుకుని, మిగతా సొమ్మును పీపీఎఫ్, ఈక్విటీ ఫండ్స్ తదితర పెట్టుబడి సాధనాల్లో మదుపు చేయండి. అప్పుడు మరింత ఆదాయాన్ని అందుకోవచ్చు. ఆర్థిక నిపుణుల్ని సంప్రదిస్తే మీకు సరిపోయే మరిన్ని పెట్టుబడి మార్గాలను సూచిస్తారు.